క్లుప్తంగా

తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభం



తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు అందిస్తున్న ఒలింపిక్ సంఘ కార్యదర్శి పద్మనాభం

నాగమల్లితోట జంక్షన్: స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో రాహుల్ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథి డీఎస్పీ సీఈఓ షేక్ ఇమ్రాన్ ఖాన్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. మార్షల్ ఆర్ట్స్ ప్రతి ఒక్కరికీ అవసరం అని చెప్పారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, ఒలింపిక్ సంఘ కార్యదర్శి పద్మనాభం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. శిబిరం నిర్వాహకుడు సత్యనారాయణ మాట్లాడుతూ మే 31 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ముందు బ్యాచ్‌లో బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు పొందిన క్రీడాకారులకు ముఖ్య అతిథులు సర్టిఫికెట్లు అందించారు. క్రీడాకారులను తైక్వాండో సంఘ కార్యదర్శి అర్జునరావు అభినందించారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు పరామర్శ



చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావును పలుకరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ట్రస్ట్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు, కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు నున్న వెంకటేశ్వరరావును సోమవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పరామర్శించారు. అతని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్, పెద్దాపురప్పాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ బొండా చంటిబాబు, పుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాల జనాభా లెక్కలు తేల్చండి



జెడ్పీ సీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న శెట్టిబలిజ జనజాగృతి నాయకులు

కాకినాడ సిటీ: దేశ వ్యాప్తంగా ఉన్న బీసీ కులాల జనాభా లెక్కలు తేల్చాలని శెట్టిబలిజ జనజాగృతి కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ మహేష్‌కుమార్‌ను, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణను కమిటీ నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఉన్న బీసీ కులాల జనాభా లెక్కలను తేల్చాలని, దీనిని ఇప్పటి వరకు అనేక ప్రభుత్వాలు వాయిదా వేస్తూ వచ్చాయన్నారు. దామాషా ప్రకారం బీసీలకు అన్నింటా ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లాలో శెట్టిబలిజ జనజాగృతి మరింత చొరవ తీసుకొని బీసీ సంఘాలను కలుపుకొని సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. జనజాగృతి జిల్లా అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అనుసూరి చినబాబు, నాయకులు కర్రి గోపాలకృష్ణ, కాలా సత్తిబాబు, రాయుడు సూర్యసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తి వేయాలి

కాకినాడ సిటీ: ఉపాధ్యాయులపై అక్రమంగా పెట్టిన కేసులు, సస్పెన్షన్లు ఎత్తివేయాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పితాని త్రినాథరావు కోరారు. మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా గతంలో ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు, కక్ష సాధింపు ధోరణి మానుకోవాలని కోరుతూ సోమవారం స్పందన కార్యక్రమంలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు జిల్లాలో ఎమ్మెల్యేలను, ఎంపీలను కలసి సగటు ఉద్యోగి ఆక్రందన లిఖిత పూర్వకంగా తెలియజేస్తామన్నారు. ఏపీజేఏసీ అమరావతి కాకినాడ జిల్లా జనరల్ కార్యదర్శి ఎస్‌వీఎస్‌ఎస్‌ఆర్‌కే దుర్గాప్రసాద్, ట్రెజరర్ పి.పుల్లయ్య, గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘ జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌వీ రవి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొండెవరం గ్రామానికి చెందిన బుర్రా పోలరాజు (41) ఆదివారం తన పొలంలో గడ్డి మందు కొట్టాడు. గడ్డి మందు కలిపిన బకెట్‌లో నీటిని తాగడంతో అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

నేత్రాలతో సెల్‌గాటం



- స్మార్ట్‌ఫోన్ల ప్రభావంతో దృష్టి లోపాలు
- నేత్ర సమస్యలతో యువత సతమతం
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదం

బోట్‌క్లబ్: జీవితం రంగుల మయం.. ఆ రంగులను మనం చూడాలంటే నయనం ప్రధానం.. అలాంటి నేత్రాలపై స్మార్ట్‌ఫోన్ల ప్రభావం పడుతోంది.. అదే జీవితంలో చీకట్లు తెస్తోంది.. సాంకేతికత వేగంగా విస్తరిస్తోంది. అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్ ఫోన్‌లో అపరిమిత సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రపంచమే మన ముగింటకు వాలిపోతోంది. ఇంత వరకూ బాగానే ఉన్నా యూత్ ఎలాంటి పరిమితులు లేకుండా గంటల తరబడి స్మార్ట్ ఫోన్‌ను చూస్తూ గడుపుతుండటం కంటి చూపుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత నెల కాకినాడ నగరంలోని వివిధ ఆసుపత్రులలో సుమారు 8 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 30 ఏళ్ల లోపు వారిలో 6 వేల మందికి పైగా కళ్లజోళ్ల అవసరం వచ్చింది. దీనిని బట్టి చూస్తే సమస్య ఎలా ఉందో చెప్పకనే అర్థమవుతోంది. ఆరేళ్ల లోపు చిన్నారులకు సైతం ఫోన్లతో సమస్యలు వస్తున్నాయి.

ఇదీ వైద్యుల మాట

ప్రస్తుతం ఆరు నుంచి 30 ఏళ్ల లోపు వారిలో అధిక శాతం మంది నేత్ర సమస్యల బారిన పడుతున్నారు. 50 ఏళ్ల వయసులో వచ్చే సమస్యలు ముప్పై ఏళ్లకే వస్తున్నాయన్నది వైద్యుల మాట. స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు, వీడియో గేమ్‌లు, కంప్యూటర్ స్క్రీన్‌లు నీలిరంగు కాంతిని, శక్తివంతమైన దృగ్గోచర కాంతిని వెలువరిస్తాయి. వీటికి సాధారణ కాంతి కంటే అధిక తరంగాల్లో దూరం ప్రయాణించే శక్తి ఉంటుంది. ఇవి కంటి లోపలకు చొచ్చుకుపోయి తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ ప్రభావం వెలుగు స్థాయి, వాటిని ఎంత దగ్గర నుంచి చూస్తున్నాం.. రోజుకు ఎంత సమయం చూస్తున్నాం.. ఎంతసేపటికి ఒకసారి కంటికి విశ్రాంతి ఇస్తున్నామనే అంశాలను బట్టి ఉంటుంది. యువత రోజుకు సగటున నాలుగు నుంచి ఐదు గంటల పాటు స్మార్ట్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగిస్తున్నారు. దీనివల్ల నేత్రాలు త్వరగా అలసటకు గురవుతాయి. దృశ్యాలు అస్పష్టంగా కనిపించడం, కంటి నొప్పి, ఎర్రగా మారడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇలాంటి సమస్యలు సహజంగా 50 ఏళ్లకు పైబడిన వారిలో వస్తుంటాయి. కానీ ప్రస్తుత 30 ఏళ్ల లోపు వారిలో కనిపిస్తుంది.

వినోదం... ఆపై ప్రమాదం

ఎక్కడైనా అతి అనేక అనర్థాలకు దారి తీస్తుందనేది జగమెరిగిన సత్యం. ఇందుకు స్మార్ట్ ఫోన్‌లను ప్రత్యక్ష సాక్ష్యంగా చెప్పవచ్చు. వినోదం, విజ్ఞానాన్ని పంచే ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్ ద్వారా కనుల ముంగిటనే ప్రత్యక్షమవుతుండడంతో గంటల తరబడి ఫోన్ ముంగిటే అతుక్కుపోతున్నారు. ఈ సదుపాయాన్ని అధిక శాతం మంది వినోదం కోసమే వినియోగిస్తున్నారు. ఎక్కువ మంది వీడియో గేమ్‌లు, ఆటలు ఆడుతూ మరింత సమయం కేటాయిస్తుండటంతో సమస్య మరింత జటిలమవుతుంది.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మంచిది

- 20 నిమిషాలకు మించి ఎలక్ట్రానిక్ స్క్రీన్‌లను చూడకుండా జాగ్రత్త పడాలి.
- ఒకసారి తప్పనిసరిగా చూడాల్సిన పరిస్థితి వస్తే ప్రతి 15 నిమిషాలకోసారి దృష్టిని తెరల నుంచి మరల్చాలి.
- వీలైనంత ఎక్కువ దూరం ఉంచి పరికరాలను వినియోగించాలి.
- గంటల తరబడి కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు ముందు కూర్చునే వారు కాంతి ప్రభావాన్ని తగ్గించే సామర్థ్యం ఉన్న కళ్లజోళ్లను వాడాలి.
- పిల్లలను టీవీలకు దగ్గరగా కూర్చోనివ్వరాదు. కనీసం మూడు మీటర్లకు పైగా దూరం ఉండాలి. మొబైల్ ఫోన్‌ను కనీసం 30 సెంటీమీటర్ల దూరం నుంచి చూడాలి.

చిన్నారుల్లోనూ సమస్యలు



ప్రస్తుతం ఆరేళ్ల లోపు చిన్నారులకు సైతం స్మార్ట్ ఫోన్ల కారణంగా దృష్టి లోపాలు వస్తున్నాయి. మా ప్రాక్టీసులో కనీసం రోజుకు రెండు కేసులైనా చూస్తున్నాం. ఫోన్ అధికంగా వాడితే వయసుతో సంబంధం లేకుండా కంటి సమస్యలు వస్తాయి.

– వి.శ్రీకాంత్, కంటి వైద్య నిపుణుడు

ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం



విద్యార్థులను అభినందిస్తున్న అదనపు కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనకు వచ్చే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు తెలిపారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా వినతులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని. ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. పారిశుధ్యం, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలకు ఫిర్యాదులు అందాయన్నారు. డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అభినందన

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీనగర్ అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ కోర్సు విద్యార్థులను ఏడీసీ నాగ నరసింహారావు అభినందించారు. హెచ్‌ఎం ఎస్.నూకరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని అదనపు కమిషనర్ అభినందించారు. హెచ్‌ఎం నూకరాజు మాట్లాడుతూ నగరంలోని 14 మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో అత్యధికంగా తమ పాఠశాలకు చెందిన 87 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.

నవరత్నాలతో ప్రతి ఇంటికీ పథకాలు



ఉప్పలంకలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- సీఎం జగన్‌ను ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: నవరత్న పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు దరిచేరుతున్నాయని రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. ఉప్పలంక గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. సోమవారం ఉప్పలంకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నాయకులు, అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి ఎమ్మెల్యే కన్నబాబు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఒక్క ఉప్పలంకలోనే 365 మందికి ఇళ్ల పట్టాలు అందించామని ఆయన తెలిపారు. ఇంకా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని, వెంటనే అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శేరు సత్యవేణి అనారోగ్యంతో ఉండడంతో ఆదుకోవాలని బాధితురాలి కుటుంబీకులు కోరగా వైద్య సేవలందించి, కోలుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలలో ప్రమాదవశాత్తు సిలిండర్ పేలిన ఘటనలో గాయపడిన భోజన పథకం నిర్వాహకురాలిని కూడా ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. జగనన్న ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో కూడా విజయఢంకా మోగించేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. తొలుత సర్పంచ్ బొమ్మిడి నయోమి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, ఎంపీటీసీ సభ్యుడు కాలాడి కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ బొమ్మిడి శ్రీను తదితరులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, నాయకులు పెంకే సత్తిబాబు, పైలా గోవిందు, పోతల లోవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల వికాసానికి విజ్ఞాన శిబిరాలు



సభలో ప్రసంగిస్తున్న ఇన్‌చార్జి జేసీ మహేష్‌కుమార్



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రామారావు



శిబిరంలో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీను మహేష్

కాకినాడ సిటీ: బాలల సమగ్ర వికాసానికి వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయని కాకినాడ జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మలు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జూన్ 11వ తేదీ వరకు 33 రోజుల పాటు జరిగే వేసవి శిబిరంలో విద్యార్థులకు సంగీతం, చిత్రలేఖనం, నృత్యం, స్పోకెన్ ఇంగ్లిషు, పేపర్ క్రాఫ్ట్, కథలు చదవడం, రాయడం వంటి పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని పద్మ తెలిపారు. తల్లిదండ్రులు, తమ పిల్లలను ఈ శిబిరానికి పంపించాలని కోరారు. జనవిజ్ఞాన వేదిక విద్యా విభాగం జిల్లా కన్వీనర్ కృష్ణశ్రీ, చిత్రలేఖనం రిసోర్స్‌పర్సన్ పీవీ బాబు, సంగీతం మాస్టార్ చక్రవర్తి, రిటైర్డ్ డిప్యూటీ లైబ్రేరియన్ సలాది సాయి సత్యనారాయణ, ములంపాక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

కరప: పుస్తక పఠనం అలవర్చుకుంటే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి రామారావు అన్నారు. వేళంగి శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యార్థుల కోసం వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జూన్ 11వ తేదీ వరకూ శిబిరం కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా చిత్రలేఖనం, పుస్తకపఠనం, కథలు చెప్పడం, పేపర్ ఆర్ట్ తదితర అంశాలపై కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి సుజాత, చక్కా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞానవంతులు కావాలి

కాకినాడ సిటీ: పాఠశాల విద్యార్థులు గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను ఉపయోగించుకుని విజ్ఞానవంతులు కావాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీను మహేష్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించే ముఖ్య ఉద్దేశంతో జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు 33 రోజుల పాటు విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల్లో ఇంత మంచి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వేసవి శిబిరాలకు హాజరయ్యే విద్యార్థులకు 10 రోజులకు సరిపడా రిఫ్రెష్‌మెంట్స్‌ను వాసవీక్లబ్ ద్వారా గ్రంథాలయ నిర్వాహకులకు క్లబ్ అధ్యక్షుడు ఎ.గంగరాజు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ, సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ ఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ లైబ్రేరియన్ ఆర్.వెంకటరాము, రిసోర్స్‌పర్సన్ కె.మెహర్, ఎ.చిన్నబాబు, బి.సూర్యనారాయణ, వాసవీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు అవగాహన సదస్సులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సర్పవరం సీఐ మురళీకృష్ణ

బోట్‌క్లబ్: నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నామని సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఆర్‌ఆర్ నగర్‌లో కాలనీ వాసులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమానితుల సంచారంతో పాటు ఏ విధమైన ఇబ్బందులు కలిగినా తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రజలు శాంతియుత జీవనాన్ని గడిపేందుకు పోలీస్ శాఖ అన్నివిధాలా సహకారం అందిస్తుందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తమ సమాచారాన్ని సమీప పోలీస్ స్టేషన్‌లో తెలియజేస్తే, వారి గృహాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఆర్‌ఆర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మాండలిక వెంకటశాస్త్రి పలు సమస్యలను సీఐ దృష్టికి తీసుకొచ్చారు. అసోసియేషన్ కార్యదర్శి ఫణిప్రసాద్, సభ్యుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం



వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధి భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం హోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి, ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వర రావు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

స్థానిక దేవాలయం వీధిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో 11న జరగనున్న విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. బాలభోగ మంగళాశాసనాలు, విన్నపాలు, నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. మహిళలకు కుంకుమ పూజలు చేశారు.

రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తిదాయకం

కాకినాడ: రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అన్నారు. సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా డేను నిర్వహించారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఆయన పండ్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ నిర్వహణలోని బ్లడ్ బ్యాంక్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న సేవా కార్యక్రమాలను పరిశీలించారు. ప్రధానంగా తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం నిర్వహిస్తున్న కేంద్రాన్ని డాక్టర్ మహేష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు ఇతర సంస్థలకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి శివకుమార్, కోశాధికారి ఎన్‌వీవీ ఆర్‌కే ప్రసాదరావు, సంస్థ సభ్యులు డాక్టర్ దుర్గరాజు, డాక్టర్ రామకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలి

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో పని చేసే అర్చకులతో పాటు సిబ్బంది డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని ట్రస్టు బోర్డు ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమవారం ఆలయంలో ట్రస్టుబోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లిబాబు అధ్యక్షత వహించారు. దేవాదాయశాఖ ఆదేశాల మేరకు ఆలయంలోని సిబ్బంది, అర్చకులకు యూనిఫారం అందజేశారు. ఈ సందర్భంగా రమేషబాబు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఉత్తమ సేవలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆలయంలో జరుగుతున్న అన్నదానంపై భక్తులకు ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, చల్లా కుమారి, బొందలపు కృష్ణవేణి, ముమ్మిడి బేబిరాణి, ఎక్స్ అఫిషియో సభ్యుడు జోగారావు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి జాతర సందర్భంగా హుండీల ద్వారా 32 రోజులకు గాను రూ.12,76,710 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ తెలిపారు. సోమవారం దేవాదాయశాఖ తనిఖీ అధికారి చల్లా ఉదయ్‌బాబు సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు.

కుంగదీసి.. ఆపై కరుణించి..

- రైతన్నలకు కాస్త ఉపశమనం
- అనుకూలించిన వాతావరణం
- పంట ఒబ్బిడి పనుల్లో బిజీబిజీ



సర్పవరంలో రైతులు ఆరబెట్టిన ధాన్యపు రాశిని పరిశీలిస్తున్న ఏడీఏ పద్మశ్రీ, ఏఓ సత్యనారాయణ



నేమాంలో వరి పనల నుంచి వచ్చిన మొలకలు

కాకినాడ రూరల్: పుడమిని నమ్ముకుని సేద్యం చేస్తున్న రైతన్నను ప్రకృతి వైపరీత్యాలు కుంగదీస్తున్నాయి.. పంట చేతికి వచ్చే సమయంలో వాతావరణంలో మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయి.. కొద్ది రోజులుగా వర్షాలు అడపాదడపా కురవడంతో వారి వెతలు వర్ణనాతీతం.. ప్రకృతి చేసిన గాయంతో అల్లాడుతున్న అన్నదాతకు రెండు రోజులుగా వాతావరణం అనుకూలంగా మారడంతో రబీ వరి చేలను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల అకాల వర్షాలకు కాకినాడ రూరల్ మండలం నేమాం, తిమ్మాపురం, సర్పవరం, కొవ్వాడ, రేపూరు, తూరంగి తదితర గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో పంట దెబ్బతింది. వ్యవసాయ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న వరి చేల వివరాలు, సంబంధిత రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. కరప మండలంలో 4,300 ఎకరాల్లో వరిని రెండో పంటగా సాగు చేశారు. ఎక్కువగా బొండాలు రకం ఎండీయూ- 3626ను పండించారు. ఎంటీయూ- 1121, సన్న రకాలను తక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం 860 ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తయ్యాయి. ఇంకా 3,440 ఎకరాల్లో మసూళ్లు జరగాల్సి ఉంది. ఆది, సోమవారాల్లో వర్షం లేకపోవడం, ఎండ రావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. తమ వరి చేలను కోయించడంతో పాటు పనలపై ఉన్న వాటిని ఒబ్బిడి చేయడం, ధాన్యపు రాశులను ఆరబెట్టడం వంటి పనుల్లో బిజీ అయ్యారు. అకాల వర్షానికి తన ఎకరం పొలంలోని వరి చేను పనలపై ఉండి తడిసిపోవడంతో మొలకలు వచ్చాయని నేమాం గ్రామానికి చెందిన రైతు ప్రభాకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్ట పరిహారం కోసం ప్రతిపాదించామని వ్యవసాయాధికారి సత్యనారాయణ తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి వారికి తగిన సూచనలు ఇవ్వడంతో పాటు పంటను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలని సూచిస్తున్నట్లు వివరించారు.

మరోవైపు 'మోచా' భయం

మరోవైపు మోచా తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. బంగాళాఖాతంపై ఉన్న ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా మారి ఆపై వాయుగుండంగా ఏ దిశలో పయనిస్తుందోనని గుబులు అందరిలో రేగుతోంది. దానిని బట్టి తుపాను ప్రభావం ఏ ప్రాంతంపై ఉంటుందో మంగళవారానికి గాని స్పష్టంగా తెలియని పరిస్థితుల్లో రైతులు మాత్రం తమ పంటను విక్రయించుకుని బయట పడాలని చూస్తున్నారు. ఏడీఏ పద్మశ్రీ మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి చేలను ప్రాథమికంగా గుర్తించామన్నారు. కాకినాడ రూరల్ మండలంలో సుమారు 150 ఎకరాలలో పంట దెబ్బతిందన్నారు. అత్యధికంగా సర్పవరం, రేపూరు, కొవ్వాడ గ్రామాల్లో పంట నష్టం వాటిల్లిందని, పరిహారం కోసం రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామని వివరించారు.